# తిరగబడ్డ పేగు

**పొ**ద్దుగూకేవేళ పైరుపై బడిన ఏటిగాలికి ఎన్నులూ కంకెలూ తలలాడిస్తున్నాయి. సూరీడు కొండలమాటుకు ఒదిగిపోతుంటే ఆకాశం ఎర్రచీర చుట్టుకున్నట్టుగా వుంది. పశువులు కొట్టాలకేసి పరుగులెడుతుంటే పాలికాపుగుంటలు ఎత్తిన ఈలపాట ఆపేసి తిట్టుకుంటూ పరుగులిడుతున్నారు. పక్షులు చెట్లకు తోరణాలు కట్టినట్లుగా వాలిపోతున్నాయి.

అరవైయేళ్ళు పైబడ్డ అప్పమ్మ చూపు మట్టిరోడ్డు వంకర్లో తిరుగాడుతూ వుంది. మనిషి మాత్రం సీమచింత చెట్టు కింద నేలన కూర్చొనుంది.

"అమ్మమ్మా..."

అప్పమ్మ తుళుక్కుపడింది. వెనిక్కి తిరిగి చూసి.... అంతలోనే నిట్టూర్పు వదిలింది. కాని మాట్లాడలేదు.

"సీమసింత బొట్టలుగాని దొరికినాయేటి?" పదేళ్ళ పిల్లాడు అడిగాడు. వాడి వెనుకే మరో ఇద్దరు వచ్చినిలబడ్డారు.

అప్పమ్మ నడుము దగ్గర చీరమడతల్లోంచి గైనంలా జాగ్రత్తగా దోపుకున్న బొట్టల్ని తీసి "ఇదర్రా... పండువి... సిలకలు కొట్నివి..." అంటూ పిల్లల చేతుల్లో పడేసింది. వాళ్ళవి పంచుకొని తినుకుంటూ పరుగుతీసారు.

అప్పమ్మ కోరిక మాత్రం నెరవేర్చుకోలేకపోయింది. ఆ పిల్లల్ని దగ్గరగా తీసుకొని ముద్దులు పెట్టాలనుకుంది. మరిన్ని ముద్దులు పెట్టించుకొవాలనీ అనుకుంది.

అప్పుడే బస్సుమోత వినిపించింది. అప్పమ్మ దిగ్గునలేచి నిల్చుంది. సుడిగాలిలా రేగిపోయిన మట్టిపొగలోంచి బస్సు వచ్చి ఆగింది. అప్పమ్మకి లేని సత్తువ వచ్చేసింది. ఆనని చూపు ఆరాటంతో దేవులాడుతుంటే మనిషి బస్సు ద్వారాన్ని చేరుకుంది. తలుపు దగ్గర నిలబడి దిగిన అందర్నీ చూసింది. అందరూ దిగిపోయాక ఆశ చావక లోపలికి చూసింది.

"ఏవమ్మో లోపట ఇంకెవుల్లేరు" అలవాటేమో? అనేసి ఊరుకున్నాడు కండక్టరు.

అప్పమ్మ గుండె కమిలిపోతోంది. నలకపడినట్టు కళ్ళు రెండూ నీటికుండలవుతుంటే ఎదురుగా ఏమీ కనిపించడం లేదు.

"ఏటోల ముసల్దానా పిల్లలెవులు వస్తామన్నారేటి?"

"దాని పిచ్చిగాని.. వచ్చినోలురారా? పోనేటి వస్తామని గాని ఉత్తరం ముక్కయినా రాసినారా అంతే లేదంతాది గదా"

"మంచి దానివే..."

మిత్తనోర్లు, బాగార్లు ఊరంతా కుటుంబమైన వాళ్ళు ఎవరికి వాళ్ళే మనిషోమాట అంటూవుంటే అప్పమ్మ బరాయించలేకపోయింది. ప్రయత్నించినా అణచుకున్న కన్నీరు ఒక్కసారిగ వుబికి వచ్చి దుఃఖంతో మాటలు రాలేదు కొద్ది క్షణాలు.

"ఏటోరయ్యా .... పదిరోజులయిన పిల్లలు మరీ కళ్లముందర మెసల్తన్నారు.... దీవేసింది... ఎలగూన్నారో ఏటో"... కళ్ళు తుడుచుకుంటూ అంది అప్పమ్మ.

"ఉత్తరం రాయే... ఆలేవస్తారు. వచ్చాక దపా సూసుకొని ఎల్తారు. సీకటి పడింది.... ఇంటికెళ్ళు' ' మిత్తనోరి బావు అన్నాడు.

అప్పమ్మ వంగిన నడుమ మీద చెయ్యివేసి అలానే నిలబడింది. ఏదో చెప్పాలనుకున్నా చెప్పలేకపోయింది.

'ఇదే అఖరి బస్సు... ఇంటి కెళ్ళి కంత తిని తొంగోయే....." కసిరినట్టుగ అంది షాపుకారమ్మ!

అప్పమ్మ ఇంకేమీ మాట్లాడకుండా ఊర్లోకి నడుస్తూవుంది.

"ఉత్తరం రాయే....?

నాలుగుత్తారాలు రాస్తే ఒక్కదపా.... ఒకుత్తరంముక్కయినా రాయలేదు" "ఉత్తరం ముక్కరాయడానికి తీరిక లేనోళ్ళకి రాడాకి తీరికవుతుందా?" "అయినా ఆల్లెంత పనుల్లో వున్నారో పాపం? తీరిక లేదేమో?"

ఆలోచనలకి ఆత్మతోనే సమాధానమిచ్చి సంతృప్తిపడింది అప్పమ్మ. ఇల్లు చేరుకుని అరుగుమీదే కూర్చుండి పోయింది. ఆమె చూపు ఎదురుగా వున్న సాల మీద పడింది. అప్పుడే వచ్చిన తల్లిఅవును చూసి లేగదూడ గెంతులాడుతూ.... పరుగులెడుతూ.... తల్లిరొమ్ముని గుద్దుతూ.... చీకుతూ.... గంతులేస్తూవుంది. తల్లి దాని వంటిని నాలుకతో నాకుతోంది.

పశువులకయినా పిల్లా తల్లి ప్రేమలున్నాయి. పక్షులయినా పొద్దుగూకే వేళకి గూడు చేరుతాయి. కాని... కాని... తన పిల్లలు తన పంచన చేరలేదేం??... మనుషులు మాత్రం ఈ బంధాలనుంచి ఎందుకు దూరమయిపోతున్నారో? అర్థం కావడం లేదు అప్పమ్మకి.

బతుకు నిస్సారంగ అనిపించింది. గుండె బరువనిపించింది. మరి మోయలేనన్నట్లు అలాగే అరుగు మీద రెండు క్షణాలు చేరగిల బడిపోయింది. అంతలోనే ఏదో గుర్తుకు వచ్చిన దానిలా లేచి కూర్చుంది.

సూరి మష్టారి కొడుక్కి కబురు పెట్టింది. ఉత్తరం రాస్తాడని ఆశ పడింది. ఆ పిల్లడు పక్క ఊరు సినిమాకు వెళ్లాడని వాడితల్లి చెప్పింది. అప్పమ్మ ఇంకెవర్నైనా పిలుద్దామనుకుంది. అంతలోనే ఆ ఆలోచనని మానుకుంది. ఎందుకంటే వేరెవర్ని పిలిచినా 'చేట భారతాలని' విసుక్కుంటారు. చెప్పిన విషయాలన్నీ రాయకుండానే రాసామంటారు. రాసిందే చదవమంటే విసుక్కుంటారు. తిరిగి చెప్పినదే చెప్తున్నావని అప్పమ్మనే అంటారు!...

అప్పమ్మకు ఆ రాత్రి కూడా తినాలనిపించలేదు. పొయ్యి ముట్టించలేదు. దీపమూ వెలిగించలేదు.

చాన్నాళ్ళ నుంచి ఆ ఇంటి పొయ్యిలో పడుకున్న పిల్లి చచ్చిపోయింది! ఇంటిచుట్టూ, ఇంట్లోనూ తిరిగే విశ్వాసమైందనే కుక్క కూడా ఇంటిపట్టున కాదు కదా, అసలు ఇంటి గుమ్మంకే రావడం లేదు!!

అప్పమ్మకు చచ్చిపోవాలనిపించింది. చావు రాలేదు! నిద్ర పోవాలని అనుకుంది. నిద్ర కూడా రాలేదు!!

అప్పమ్మకు ఆలోచనల నిండా కొడుకులూ కూతుర్లూ మనుమలే నిండిపోయారు. గంపంత సంసారమని గొప్పగా గర్వంగా చెప్పుకొనే అప్పమ్మ ఏకాకి అయింది. ముసిలోడు బ్రతికినన్నాళ్ళూ ఇద్దరూ కలిసే వుండోళ్ళు. పిల్లలూ పిల్లల పిల్లలూ సెలవులకి... పండగలకి... వచ్చి పొయేవాళ్ళు ముసలోడికి కాళ్ళూ చేతులు పడిపోయాక, తనువు మీద నమ్మకం చాలించి వున్న ఆస్తి పంపకం గబగబా కానించి మరీ చచ్చిపోయాడు. అప్పమ్మ పేర్న ఇల్లు మాత్రం వుండిపోయింది. మిగతా చెక్కాముక్కా అమ్ముకు వెళ్ళిపోయారు పిల్లలు. పల్లెలోని 'గూడు'కు పెద్ద 'విలువ' లేదని పట్టించుకోలేదేమో గాని తర్వాత్తర్వాత రావడం తగ్గించేసారు!

అప్పమ్మ ఏ పిల్లల దగ్గరికి వెళ్ళినా రెండ్రోజుల్లో తిరిగి వచ్చేసేది. తనో... వాళ్ళో ఎవరి వల్లనయితేనేం... ఇమడలేకపోయేది. పరమాప్తంగ... పరమాన్నంగ భావించే ప్రేమలో ఆత్మీయతలో వాత్సల్యంలో వెంట్రుక వాసి గీత వచ్చినా రేపది భూకంపమై విడదీసస్తుందని... దూరం చేస్తుందని... భ్రమించేది, భయపడేది. అందుకే ఒంటరితనం వల్లకాడులో వుండయినా తన పేగు తెగిపోకూడదని అనుకుంది!

అలసిన మెదడుతో కళ్లు కూటిరెప్ప మాటుకు వెళ్ళి కోడికూతతో అంతలోనే ధిగ్గున కూర్చుంది. నిలబడింది. ఇటూ అటూ తిరిగి ఏటి వైపు నడిచింది. తెల్లవారక ముందే ఏటిస్నానం ముగించి, తిరిగి ఊరిలోకి వస్తూవస్తూ దారిలో... బస్సు స్టాండ్‌లో తడిబట్టతో అలానే నిలబడిపోయింది. కాళ్ళు ముందుకు పడలేదు.

అప్పమ్మని ఎరిగిన వాళ్ళు, ఎరగని వాళ్ళు పిచ్చిదాన్ని చూస్తున్నట్టు చూస్తున్నారు.

"ఏటి తెల్లారగట్ల మల్ల వచ్చేనావా? బస్సులు తిరగడం లేదు... స్టయికట. పోలీసులున్నూ డ్రైవేర్లు, కండక్టర్లున్నూ గొడవ పడినారట. బస్సులు తిప్పమని బస్సులోళ్ళు బందుకు దిగినారట... స్టయికట".... మిల్లు మేస్త్రి మాటలకు అప్పమ్మ నోరు వెళ్ళ బెట్టేసింది. నెత్తిన పిడుగుపడినట్లు చూసింది. ఆ చూపులో బస్సులు తిరగక పోవడం వల్లే తన పిల్లలు తన దగ్గరకు రాలేక పోతున్నట్లు అనిపించింది.

"ఎన్నాళ్లుంటాది?"

"ఏమో.... తెలదు.... గొడవ తేలినదాక వుంటాది"

"గొడవ ఎప్పుడు తేల్తాది?"

"నాకేటి తెలుస్తాది??"

"తెల్దా....?

ఈసారి మేస్త్రి విసుక్కొని గబగబా వెళ్ళిపోతుంటే అప్పమ్మకు కోపం వచ్చింది. మేస్త్రిని ఆపాలనిపించింది. తన్నుకున్న పోలీసులు, కండక్టర్ల పీకలు నులిపెయ్యాలనిపించింది. బస్సుల్ని ఆపకుండా అన్నివేళలా తిప్పాలనిపించింది.

అక్కడికొచ్చిన ప్రయాణికులు ఈసురోమంటూవెనెక్కి వెళ్ళిపోయిన వాళ్ళు వెళ్ళిపోతుంటే మరి కొందరు నాటు బళ్లు కట్టడానికి సిద్ధమౌతున్నారు.

ఆ పరిస్థితి చూస్తుంటే అప్పమ్మకు గతం గుర్తుకు వచ్చింది.

'గతంలో ఓసారి' ఇలానే బస్సులు తిరగలేదు. అప్పుడు అప్పమ్మ కూతురింటికని బయలేదేరింది. బయలు దేరాక వెనిక్కి పోవడానికి మనసొప్పలేదు! ఇలానే ఎలాగోలా వెళ్ళిపోయి మరీ కూతురు దగ్గర వాలిపోవాలనే ఆరాటం.... అంతే చోడవరం వూరు నుంచి ఉర్లాం స్టేషనుకున్న పదకుండు కిలోమీటర్లూ నడిచే చేరుకుంది. రైలు బండికి పోదామంటే రైళ్ళూ తిరగడం లేదన్నాడా స్టేషన్ మాష్టారు. కోచీ(పాసింజరు) కేన్సిలయిందన్నాడు. అదేమిటని అడిగితే మన ప్రధానమంత్రిని చంపేసి నందుకు బందులు జరుగుతున్నాయన్నాడు.

అప్పమ్మకు నెత్తిన పిడుగు పడినట్టయి అంతదాక నెత్తిన వున్న మూటను దించలేక దించింది. బళ్లు ఎప్పుడు నడుస్తాయో ఎవరికి తెలీదంటున్నారు. అప్పమ్మకి ఒకటే పిచ్చిగవుంది. వంటికి శక్తి సన్నగిల్లి నీరసంగా తోచినా సరే, వెనిక్కి పోవాలంటే ససేమిరా మనసు మొండికేస్తోంది. ఎవ్వరి మాట విననంటోంది.

ఎటువాళ్ళటు విడిపోతున్నారు. వచ్చిన వాళ్ళు ముందుకెలితే ఏం ప్రమాదమోనని వెనుదిరుగుతున్నారు. మరి కొద్ది సేపటికి స్టేషనులో పిట్టయినా లేదు. భూమ్మీద జీవరాసులే లేనట్టు తోచింది అప్పమ్మకి.

అప్పమ్మ మాత్రం ముందుకు వెళ్ళడానికే నిశ్చయించుకుంది.

మూట తల మీదకు ఎత్తుకుంది కాలికి చెప్పులూ నెత్తిన సుమ్మ గుడ్డా లేవు. చెప్పులంటే అలవాటులేదు. సుమ్మ గుడ్డ గాబరాలో మర్చిపోయింది. మూట మళ్ళీ దించి పైటనే సుమ్మచుట్టి, జాగర్తగా దాని మీద మూటను నిలుపుకుంది. ఎండ అలవాటే అయినా కాళ్ళు చుర్రు మంటున్నాయి. ఆగని నడకకు దూరం దగ్గరయింది.

ఇంటి దగ్గర్నుండి స్టేషనుకున్నంత దూరం కంటే ఎక్కువ దూరం నడిస్తే నరసన్నపేట వచ్చింది. అడిగితే అక్కడి నుండి తన కూతురున్న వూరు కాశీబుగ్గకి యాభై కిలో మీటర్లయినా వుంటాదన్నారు. ముసలిదానవు చచ్చిపోతావ్ అన్నారు. చావు గురించి భయం లేదు ఇక్కడుండి బతకమంటే

బతక లేదు. కిలోమీటర్ల లెక్కలు అప్పమ్మకి అర్థం కాలేదు. 'కోసిల్లు-పర్లాంగులు' అయితే అర్థమవును.

'ఏం సేద్దుంరా దేవుడా' అనుకుంటూ అప్పమ్మ మూటదించి చెట్టు నీడన కూర్చుంది అప్పుడే భగవంతుడు పంపించినట్టు రావన్నమ్మట వచ్చింది. తనూ తన కొడుకింటికని బయల్దేరి చిక్కుకుందట.

ఇద్దరి గమ్యం ఒకటే కావడంతో ఒకే జట్టయిపోయారు. నేస్తరికాలు కూడా కట్టుకున్నారు. ఆ మధ్యాహ్నపు మండుటెండ వాళ్ళ సంబరానికి మద్దెలమోతలావుంది.

"ఆ... కాలం కాశీకి నడిసిపోయోలు లేదుగాని... అలాటిది కన్న పేగు దగ్గిరికి పోడాకి కలకత్తా ఐతేటి? కైలాసమయితేటి?" అంది రావన్నమ్మ. అప్పమ్మకి ఎందుకో ఆమాట నచ్చింది. ఆ మాటాడిన రావన్నమ్మ మరీ నచ్చింది.

"నాకన్న జింకినీలాగున్నావే"... ముద్దుగా రావనమ్మ ముఖం మీదే అంది.

"కూతురుకాడకి ఏటి తీసికెళ్తన్నావ్?" రావన్నమ్మ అడిగింది.

"ఆ ఏ ముంది బంగారం? రెండు బెల్లపు దిమ్మలు, తూముడు పెసలు, తూముడు మినుములు. ఇన్నిగల్లు జునుగులు, అద్దడు ఆవునెయ్యి పూజికి, ఇంక.... అయినేటుంతాయి మన పల్లెటూరిల్లంట...? మూటగట్టిన సురుకుల లిస్టు చదివీ ప్రశ్నించింది. మొత్తం ముప్పై సేజీల పైనే బరువు మోత!

ఇద్దరూ కాల్చిన గోధుం రొట్టెలు తిని' నీళ్ళు తాగి మూటలు తలకెత్తుకొని మళ్ళీ ప్రయాణం. ఎన్ని అడుగులు? ఎన్ని ఆమడలు? ఎంత అలసట? ఎంత జువ్వున పికేవి నరాలు? కాళ్ళకింద ఎన్ని కాలిన సిటిపొక్కులు? అందులో ఎన్ని చిదిగేవి? ఎంత మంట పెట్టేవి?

చీకటికి, నిశ్శబ్దమయమయిన రోడ్లకి భయం వేసేది. ధైర్యమూ వుండేది.

ఎలాగయితే నేం? రామన్నమ్మ ఊరు టెక్కలి. ఆ రాత్రి కల్లా చేరుకొని. ఆ రాత్రికి అక్కడే తిని పడుకుంది. తెల్లవారి అప్పమ్మ మళ్ళీ బయలు దేరింది. రావన్నమ్మ అభిమానంగా ఆరోజు వుండిపోమని అనబోయి అప్పమ్మ ఆతృత చూసి ఆపలేదు. పైగా మిత్తరాలి పట్టు గట్టిగా నెరవేరాలని కంచుడు పకాలన్నం పెటింది. అప్పమ్మ కూడా మళ్ళీ కలుస్తామో లేదోనని మిత్తరాల్ని పదల్లేక వదిలింది.

అప్పమ్మ ఒక్కర్తీ నడవలేక. మూటకి చెయ్యి సాయం లేక ముడుకులు పట్టు వదిలేస్తున్నా మొండిగా నడుస్తూ.... తూలుతూ.... మూట ఎత్తేసింది. బెల్లపు దిమ్మకున్న కుండ పెంకులు విరిగిన చప్పుడు. నెయ్యీసీసా తడుముకుంది.... పరవాలేదు మరి మూట విప్పలేదు. కూతురి ఊరు కనుచూపు మేరలో కనిపించే సరికి ఇక ఆగలేదు. మూటను తలమీద, వీపుమీద, భుజమ్మీద.... మార్చి మార్చి.... కూతురిల్లు వచ్చాకే మూర్ఛపోయింది. ముఖం మీద నీళ్ళు చల్లి నీళ్ళు పడితే అప్పుడు తేరిపార చూసింది. ఆనందం కెర్లిపోతూ తన్నుకొస్తుంటే.....

"ఏం ఉపద్రవం ముంచు కొచ్చిందని ఇలాగ వీధిల పడ్డవ్? దార్లో గొంతెండి చచ్చుంటే.... నీకేం లోకం మమ్మల్ని ఆడిపోసుకుంటుంది. పైగా అనహ్యంగా మూటలేమిటి.... నీ

అవతారమేమిటి?'' అల్లుడి పరువు భయం చూసి కూతురు ప్రతిష్ట కోసం ప్రాకులాడింది!

అప్పమ్మకు అప్పటికప్పుడు అర్థమయింది తక్కువే, అర్థమయిందేదో అసంతృప్తిని ఎక్కువ చేసింది. మనసెందుకో చివుక్కుమంది.

పిల్లల్ని ముద్దులాడ బోయింది వాళ్ళు దొరకలేదు. పొద్దున్న ప్రైవేట్లు అదయ్యాక సాయంత్రం వరకూ స్కూల్.... వాళ్ళకి తోడు కేరీజులు! మనుషుల్లేరు! సాయంత్రం ట్యూషన్.... రాత్రి హోంవర్క్.... అదయ్యాక నిద్ర.... మళ్ళీ వేకువన లేపి చదువుతో ప్రారంభం....

అప్పమ్మ భరించలేక పోయింది. మూడేళ్ళు కూడా నిండని వాడ్ని 'అలవాటుకని' వాడి కిష్టం లేకుండా పంపిస్తుంటే అప్పమ్మకి కష్టమయిపోయింది. కూతుర్ని అడ్డుకుంది, తగువు పడింది. వెళ్ళనివ్వనంది. తనతో తీసుకుపోతానంది ఏడ్చింది... ముద్దులాడింది.

'నువ్వు పల్లెటూరి బైతువు.... నీకు చదువు తెలీదు' అంది కూతురు. గాలి లేకుండా బతకొచ్చేమో గాని చదువు లేకుండా ఒక్క క్షణం కూడా బతకలేరన్న అల్లుడ్ని అడ్డుకోలేక పోయింది. అలాగని తలవంచుకోలేకపోయింది. ఇంటికి తిరిగి వచ్చేసింది.

"అప్పమ్మా.... అప్పమ్మా.... ఏటిది?'' కుదిపింది షావుకారమ్మ.

అప్పమ్మ ఈలోకానికి వచ్చింది.

అప్పమ్మ కట్టుకున్న తడిచీర ఎంతసేపు నిలబడి ఆలోచనల్లో పడిందో గాని చాలా మటుకు ఆరిపోయింది.

"ముసిలయిన కొల్దీ నీకు సేదస్తం ఎక్కువవుతున్నట్టుందే.... రేపు బస్సులు తిరిగితే ఎల్దువుగాని లే ఎల్లే!.... ఎల్లి.... తడికోక మార్సు.... జలుబు సేసి గలదు.... ఎల్లే....'' షావుకారమ్మ అప్పమ్మని చెయ్యి పట్టుకులాగి ఊరి వైపుకు తోసింది.

అప్పమ్మని అందరూ పిచ్చిదాన్ని చూసినట్టు చూస్తున్నారు.

అప్పమ్మ నిస్సత్తువుగ ఇల్లు చేరింది.

అరుగు మీద కోక మార్చకుండానే కూర్చుంది. వన్నాట్లో కాకి 'కావ్ కావ్' మంది. అటుచూసింది కాకి మళ్ళీ 'కావ్ కావ్' మంది. అప్పమ్మ లేచి వన్నాట్లోకి వచ్చింది. కాకి అరుస్తూనే వుంది.

అప్పమ్మకి కాకి ముద్దుగనిపించింది. మంచిగ కనిపించింది. ఇంకా అరవాలనిపించింది. అరిస్తే... అలా అరిస్తే ఇంటికి చుట్టాలు వస్తారట... ఇపుడు తన పిల్లలే వస్తారు... వస్తారు... మళ్ళీ ఆమెలో ఆశ మొదలయ్యింది.

పిల్లలిపుడు వస్తే...???

అమ్మో... కుండలో ఒక్క మెతుకు లేదు...!!! వాళ్ళొచ్చాక వంటసేస్తేనో...? అల్ని... ఆకలితో పెట్టి... వీల్లేదు... వీల్లేదు...!

పొయ్యి వెలిగింది.

పొయ్యి మీద బియ్యపు ఎసరు కెల్లింది. కుతకుత మంది... అన్నమయింది పిల్లలు మాత్రం రాలేదు. కాకి మాత్రం కదల్లేదు. అరుపువదల్లేదు. తొలికుండ కూడు పొయ్యి చుట్టూ తిప్పి విసిరింది. ముద్దని కాకి తిన్నాది. తిన్నాక అరవలేదు.... మరివుండ లేదు. అప్పమ్మకు కోపమొచ్చింది.

చాలా ఆకలి వేసింది.

రెండు ముద్దలుతిని చెయ్యివేలాడేసి తలమీద చెయ్యి వేసుక్కూర్చుంది చెయ్యి ఆరిపోయింది. కుండ, కంచం పక్కకు తోసి చెయ్యి కడుక్కొని ఇంట్లోకి వచ్చింది. ఫోటోలు మసిపల్లో తనచూపు ఆనని తనం వల్లో... స్పష్టంగా కనిపించలేదు. కాని కళ్ళముందు మెదుల్తున్నారు.

నేలకు చేరగిలబడిన అప్పమ్మకు నిద్రపట్టేసింది.

పోస్టుమేను వచ్చాడు ఉత్తరం చదివాడు.

మరి నాలుగు సార్లు చదవమంది. పోస్టుమేను తన డ్యూటి ఇక్కడే గడచిపోయినట్టుందని విసుకున్నాడు.

"నీ బుర్ర మంగల రావుడు గొరగ... ఏనికలాగయిపోతావ్? డ్యూటి.... ఉత్తరాలు పంచడమే కదరా.... కాకపోతే నియ్యేనక నానొచ్చి సర్దేస్తాన్లే!...." ఆర్డర్‌తో పాటు అభయమూ ఇచ్చింది.

ఆ ఉత్తరాన్ని అన్ని రకాలుగ చదివాక. పాత ఉత్తరాల కట్ట మళ్ళీ ఇచ్చి చదవమంది అప్పమ్మ.

"నేను వేరే వూరుకి ట్రాన్సుఫర్ పెట్టుకున్నాను.... ఇవ్వక పోతే రిజైన్ చేసి మరీ వెళ్ళిపోతాను....' ' నవ్వూ, ఏడుపు కలగలుపుతూ అన్నాడు పోస్టుమేను.

"రిజైనో.... రేవులపాడో నీ ఇష్టమొచ్చిన ఊరెళిపోదూగాని.... ముందల ఈ ఉత్తరం సదివిమి......" అందిచింది అప్పమ్మ. పోస్టుమేను సాలెగూడులో చిక్కుకున్న పురుగులా కదుల్తూ చదవనారంభించాడు.

"అమ్మమ్మకి నమస్కారాలు!

నీ ఉత్తరాలు అందుతున్నాయి. కాని రావడానికి కుదరడం లేదు. నాన్నకేమో డ్యూటీలు, అమ్మ ఇంట్లో వంటా వార్పు చూసిమరీ కేరేజులు కట్టాలి అన్నీ చూడాలి. ఆడపిల్లలు లేని ఇంట్లో.... చెయ్యిసాయం లేని ఇంట్లో.... ఇల్లొదిలి రావడం ఎలా కుదురుతుంది? పైగా మీ ఊరు రావడానికి సదుపాయాలు లేవు. రైల్లో వచ్చి బస్సు మారాలి. పైగా మీ ఊరి స్టేషన్‌లో కోచ్ (పాసింజరు) తప్ప తక్కినవేవీ ఆగవు. దానికి వచ్చినా ఏ బస్సు ఎప్పుడు వస్తుందో రాదో తెలియదు. పడిగాపులు కాయాలి. మీ ఊరు రావడమంటే తిరుపతి కొండ ఎక్కినట్లే! ఒక్కలూ రాలేరు. అందరూ రావడానికి అవదు. సెలవుల్లో వద్దామన్నా మీ ఇంటికి కరెంటు లేదు. తమ్ముడు వాళ్ళు చదువుకోవడం అవదు. నాన్నలాంటోళ్ళు వస్తే మంచి కూరలే దొరకవు. అన్నీ ట్రబుల్స్! ఇన్ని ట్రబుల్స్‌తో ఎలా రమ్మంటావ్ నీవే చెప్పు....?

అప్పమ్మకు మరి అర్థం కావడం లేదు పోస్టుమేన్ చదవడం ఆపలేదు...

తులుక్కుపడి నిద్రలోంచి లేచి కూర్చుంది అప్పమ్మ చుట్టూ చూసింది. పోస్టుమేను లేడు ఉత్తరమూ లేదు. తను ఒక్కర్తీ మిగిలివుంది!

వచ్చింది కల అయినా కడుపంతా దేవినట్లనిపించింది. ఒళ్ళంతా చెమట పట్టింది. అప్పుడెప్పుడో రాసిన ఆ (ట్రబుల్స్) ఉత్తరమే ఎప్పటికప్పుడు భూతంలా వెంటాడుతోంది. కలో భ్రమో తెలియకుండా రాత్రికీ పగలుకూ తేడా లేకుండా చుట్టూ తిరుగుతోంది. ప్రశ్నిస్తోంది. నిలదీస్తోంది. గుచ్చి గుచ్చి గుండెను తూట్లు పొడుస్తూవుంది.

ఇప్పుడూ అప్పమ్మను అదే విధంగా నిల్చో పెట్టింది.

అప్పమ్మ భరించలేకపోయింది. భయపడుతూ కూర్చోలేకపోయింది.

పెట్టె, అల్మరా అన్నీ వెదికింది. గాదుల్లోని ధాన్యం తీసింది వున్న కసిన్ని అమ్మింది. డబ్బులు పోగు చేసింది. కోమటింటి కెళ్ళింది. సబ్బులూ, కాయగూరలు, పప్పులూ నూనె.... గుర్తుకొచ్చిన సమస్తమూకొంది. "పిల్లలొచ్చారా?" కొట్టువాడి ప్రశ్నకి సమాధాన మివ్వలేదు.

"పిల్లలు, మనవలు వస్తామన్నారుగావల్ల"

"వచ్చినపుడు కొనరాదా?"

ఎవ్వరి మాటలకు అప్పమ్మ సమాధాన మివ్వలేదు. ఏదో పంతం పట్టినట్టు.... అది సాధించ బోతున్నట్టుందే గాని ఇంతకు మునుపు పిల్లలొచ్చినపుడులాగ ఆనందంతో హడావుడిగా వున్నట్టు కనిపించడం లేదు.

"సబ్బే కొనని అప్పమ్మ సగ్గుబియ్యం వరకూ కొన్నాదంటే...."

అప్పమ్మ ఎవ్వరి మాటల్ని వినిపించకోకుండానే ఇంటికి వచ్చింది. అవసరమయిన సామానులన్నీ వున్నాయో లేదో చూసుకుంది. తర్వాత కరంటు కృష్ణ ఇంటికి వెళ్ళింది. తన ఇంటికి కరెంటు వెయ్యమంది. కరెంటు కృష్ణ తనకే షాక్ కొట్టినట్టు చూసాడు. అప్పమ్మ కృష్ణని ప్రశ్నలెయ్యనివ్వలేదు. కరెంటు వెయ్యమంది. మీటరు పడడానికి ఆలస్యమవుతుందంటే అప్పమ్మ ఒప్పుకోలేదు. రొండొందలు ఎక్కువయినా ఇచ్చుకుంటానంది. అలాగే కాళ్ళకడియాలు తాకట్టు పెట్టి మరీ ఒప్పుకున్న డబ్బు ఇచ్చింది. కరెంటు వస్తుందన్నాడే గాని ఇంకా రాలేదు!

అప్పమ్మ వీధిలో కనిపించిన ప్రెసిడెంటుని వీధిలోనే నిలబెట్టేసింది. మన వూరికి బస్సు సదుపాయం సరిగ్గా లేదంది. రైలొచ్చే వేళకు బస్సులు అందడం లేదంది. వున్న బస్సులు సరిపోవడం లేదనీ అంది. రైలు మనవూరిలోకి వుంటే బాగున్ను అంది వచ్చీపోయినోళ్ళకి కష్టమవుతూందని కూడా అంది.

ప్రెసిడెంటు పిచ్చి పట్టినట్టుగ అప్పమ్మ వేపు చూసాడు.

అప్పమ్మ కోరిక తీరందే వదిలినట్టుగలేదు. అది గ్రహించి సరేనన్నాడు. తప్పక చూస్తానని ఒట్టు వెయ్యక తప్పింది కాదు.

సూరి మాష్టారి కొడుకుని పిలుచుకొచ్చి కూర్చో పెట్టి ఉత్తరం రాయమంది. కాగితం మీద కలం ఆనక ముందే.. "సీరస్తు సిరంజీవులైన కూతురు, అల్లుడు, మనవలకు ముద్దులు... దీవనలు ఎవరి వాలకి రాసేనావా? అదీ మనింటికి కరెంటు వచ్చేస్తాది... అప్పుడికల్లా వచ్చేస్తాది కదరయ్యా?.... మరయితే తఖరల్లేదు (ఫరవాలేదు) వచ్చీసిందనే రాయి. మరేమొచ్చి కూరలు నారలు బాగా

దొరకతన్నాయని... ఉమ్మిరి సిజననీ రాయి... అయన్నీ తెచ్చే వుంచీసినాన్లే... ఇంకేటి సెప్పురయ్యా... మానూర్లోట ఏవి లేవన్నారో... అవన్నీ ఎలిపోచ్చేస్తన్నాయని రాయిమీ...రైలు దిగీ దిగ్గాన బస్సులు కాసుక్కూకుంతాయని ఎక్కి సక్కగ ఎలిపోరావచ్చని రాయి. సదువుకి కానిమెంటు మేస్టేరునా ని రాయి. అలున్ని రెండ్రోజుల్లోట ఏటి సదివేస్తారు? అయినా ఆలకి కంత బోద. తండాగ వుంచె రాయిలే.... నాన్సెప్పాలా నువ్వు తెలివయినోడివి... బాగరాస్తావ్... రాసే... పిల్లల్ని బడికి తీసికెళ్ళినప్పుడు జాగర్తని రాయి... మద్దేనం ఎవులో ఎల్లి సిన్నోళ్ళిద్దరికి రొండు ముద్దలు కుడిపితే బాగని రాయి..

"ఉత్తరం మరి పట్టదు అయిపోయింది" అన్నాడా అబ్బాయి.

"అప్పిండయిపోయిందా?... మరేట్టేవు... రొండిమ్ముల్లు రాసీమి... బేగి రమ్మని... సూరేదత్త గోరి ఆవు ఈనింది... జున్ను జున్నంటే వోలుకుటామాము కిష్టం... అ... జున్ను పాలు ఇవిరిపోకుండా బేగి రమ్మను ... రాసేనావా... లవింత అడిగినట్టు రాయి... ఇన్ని ముద్దులని రాయి..." ఎదురుగా మనమల్ని ముద్దలాడినంతగా సంబర పడిపోయింది అప్పమ్మ.

"ఇదిగో..." ఉత్తరం అందించాడు సూరి మాష్టారి కొడుకు.

"అన్నీరాసేనావు కదా... నాయయ్యే..." అని ముచ్చటపడి వాడి తల నిమిరి మెచ్చుకుంది అప్పమ్మ.

ఆ అబ్బాయి వెళ్ళిపోయాక "అయ్యో ... ఎంత బేగి ఎలిపోండు... ఈడి గాబర గోతి లెట్ట.... మరోపాలి సదివుంతే బాగున్ను. ఎవులిసేతో సదివించి ఉత్తరమేసేవాల" అనుకుని తలుపు దగ్గరకు వేసి, పోస్టు డొక్కుకని బయలు దేరబోతే పోస్ట్‌మేను నిజంగానే ఎదురయ్యాడు.

పోస్టుమేనుని చూసి తన పిల్లలే వచ్చినంత సంబర పడింది!

"ఈ ఉత్తరమేసిమీ బాబ్బాబు... అరిజెంటుగ ఎలిపోవాల... రేపియ్యాలకి ఆలకి అందిపోవాలమీ... మర్సిపోకుమీ..." అప్పమ్మ మాటలు పూర్తికాక ముందే నీకు ఉత్తరమమ్మ" పోస్టుమేన్ అన్నాడు'అ..." అని ఆశ్చర్యపడి ఆ కార్డుని లాక్కుంది తిప్పి చూసింది తిరిగి పోస్టుమేనుకిచ్చి చదవమంది అర్థం కాకపోయినా అందులోని అక్షరాలకేసి చూస్తోంది. కూర్చుంది.... నిల్చొంది... కదిలింది... సరిగ్గా వుండలేక పోతూవుంది.

పోస్టుమేను ఉత్తరం చదివాడు:

"అమ్మకు నమస్కారాలు!

నీ ఉత్తరాలన్నీ అందుతూనే వున్నాయి. రావడానికి ఇప్పట్లో అవదు. ఈ సెలవుల్లో మేం తిరుపతి వెళ్ళొచ్చు. ఎప్పుడు రావడానికయినా ఆయనకా సెలవు దొరకదు. పిల్లలా చదువులు. నాకు ఇంటిపని వంటపని ఎప్పుడో రామా? అన్నీ కావాలంటే అవదు కదా వుంటాను.

ఆగిపోయిన పోస్టుమేన్ను "అయిపోయిందేటి ఆపేసావు... సదువు" కుదిపింది అప్పమ్మ.

అప్పమ్మ ఆతృతకీ, ఆ ఉత్తరంలో వున్న నిర్లక్ష్యంకీ, ఆవిడ కుదుపుకీ పోస్ట్‌మేన్ తులుక్కుపడ్డాడు తడబడ్డాడు.

''సదవ్వయ్యా... ఏటాలోసిత్తన్నావ్... సదువులే...?

అక్కడున్న అక్షరాలన్నీ చదివాడు. ఇంకేమి చదవాలో పోస్ట్‌మేనుకయితే అర్థం కాలే!

''ఆలు రామని అలాగే అంతార్లే... నువ్వు సదువు'' మళ్ళీ అంది.

''మరి...మరి... ఇంక'' పోస్టుమన్ నసిగాడు.

రాత అర్థమవలేదేటి? ఆలు గాబరాల రాసుంతారు. మావోల్లుకి పనులెక్కువలే... మరయితే పిల్లలెలాగున్నారు? ముద్దులని రాసినారా?.... ఇంగిలీసుదొరలు ఎందుకు పనికొస్తారు... అంత తెల్లగ వుంటాది సిన్నది... పెద్దోడు సామన సాయ, నడిపోడు నల్లగ వుంటాడు అయితే తేటయిన మొకం... అవునయ్యా కిష్టుడు నలుపుకదా? పేరు పేరున్నాకు ముద్దులని రాసినారా?... అదొక్కపాలి సదివీమి... అయ్యయ్యంతాను...'' అప్పమ్మ మాట్లాడుతూనే వుంది.

పోస్టుమేను దించిన తల ఎత్తలేదు.

అప్పమ్మ ఎందుకనో అగిపోయింది. పోస్టుమేను తలెత్తి చూసాడు. అప్పమ్మ కళ్ళలో కన్నీటి జీరలు...

''అయితేటి అలు రామనీసినారు అంతే కదరా... రాకపోన్లేరా... రాకపోనీలే? బలవంతంగ తేగలమా? తేలేము.... తెచ్చినా వుండాలేరు... అలకి బుద్ధి పుట్టాల అంతే అపచ్చికి, పిచ్చిదాన్లాగ పేలుతాను గాని... ఎవులు బతుకులు ఆలవి'పేగు తెగిపోయినప్పుడే తెగిపోయినట్టు!' అది తెలీక ముడేసుకున్నట్టు అనుకుంతాం... తెలిసీ ఎందుకో గాని...'' అప్పమ్మ మరి మాటాడలేక పోయింది దుఃఖం గొంతును కప్పెట్టింది. బాధతో మనిషి వెక్కి వెక్కి ఏడుస్తూ కదిలిపోతోంది చాలా సేపటికి గాని మామూలు కాలేకపోయింది.

''వస్తానమ్మా...'' పోస్టుమేను వెళ్ళిపోతున్నాడు.

అప్పమ్మ తను రాయించిన ఉత్తరం పోస్టు చేయడానికి ఇవ్వకుండా. తన చేతుల్లోనే ఇడుకొనివుంది.

పోస్టుమేను ఆగి, మళ్ళీ అప్పమ్మ దగ్గరకు వచ్చాడు.

''ఉత్తరం పోస్టు చెయ్యాలా?'' అడిగాడు.

అప్పమ్మ సమాధానం ఇవ్వలేదు. ఉత్తరమూ ఇవ్వలేదు.

పోస్టుమేన్ మరింక ఏమీ అనకుండా అక్కడి నుండి కదిలాడు. అప్పుడు అప్పమ్మ కేకవేసింది కేకతో పాటు పోస్టుమేన్‌ని చేరింది. తను రాయించిన ఉత్తరం చేతిలో పెట్టింది.

పోస్ట్‌మేన్ తృప్తిగా కదిలాడు.

★ ★ ★

*ప్రచురణ : 'రాఘనిన్ కోకిల' ఏప్రిల్ 1995 మరియు మాతృక*

*రచనాకాలం : 4 నవంబర్ '92*